క్లుప్తంగా

దొంగతనాలతో అప్రమత్తం

సీఐ కృష్ణభగవాన్



సామర్లకోట: వేసవి కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎండ వేడి, గాడ్పులను దృష్టిలో ఉంచుకొని రాత్రి సమయంలో ఎక్కువగా ఆరుబయట నిద్రించడం, డాబాలపై నిద్రిస్తుంటారని, కొందరు తలుపులకు సమీపంలోని కిటికీలను గాలి కోసం తీసి ఉంచుతారని తెలిపారు. వీటిని దొంగలు ఆసరాగా తీసుకొని సులభంగా దొంగతనాలు చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. వేసవి కాలంలో పిల్లల సెలవులను దృష్టిలో ఉంచుకొని ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లు వెళతారని, ఆ తాళాలు కూడా బయట వేయడం వలన దొంగలు ఇంట్లో ఎవరూ లేరని గుర్తించి దొంగతనాలు చేయడానికి వీలు కలుగుతుందన్నారు. ఇంటి యజమానులు ఊళ్లకు వెళ్లే సమయంలో సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్లకు సమాచారం ఇస్తే ఆయా ప్రాంతాల్లో పోలీసు గస్తీ పెంచడంతో పాటు సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకొవాలని ఆయన సూచించారు. సీసీ కెమెరాల ద్వారా దొంగలను గుర్తించి చోరీ సొత్తును రికవరీ చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసుల అవసరం అయితే తనను 9440796568 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ధాన్యం రవాణా సొమ్ములో అవకతవకలు



మలకల సూరిబాబు

సామర్లకోట: రైతులు పండించిన ధాన్యాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన సమయంలో రవాణా చార్జీలు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ కావలసి ఉండగా మధ్యవర్తుల ఖాతాలకు జమ చేస్తూ నిధులు స్వాహా చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు ఆరోపించారు. ప్రతి రైతుకు కనీసం రూ.ఐదు వేల నుంచి రూ.15 వేల వరకు రవాణా చార్జీలుగా జమ కావలసి ఉంటుందని, ఈ మొత్తం రైతుల ఖాతాలకు జమ కావడం లేదని సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ధాన్యం కొనుగోలు జరిగిన సమయంలో తప్పని సరిగా రైతు ఖాతాలకే జమ చేయాలనే నిర్ణయం ఉండేదన్నారు. దీనిపై ధాన్యం కొనుగోలు కేంద్ర సిబ్బందిని ప్రశ్నిస్తే మధ్యవర్తుల ఖాతాలకు రవాణా సొమ్ము జమ చేయాలనే సూచనలు ఉన్నాయని చెప్పుతున్నారని సూరిబాబు తెలిపారు. దీని వలన రైతుల సొమ్ము స్వాహా అవుతుందని ఆయన ఆరోపించారు. దీనిపై విచారించి రైతులకు న్యాయం చేయాలని సూరిబాబు డిమాండ్ చేశారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఐ.సత్యను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో డేటా ఆపరేటర్ రవాణా చార్జీలు ఎవరికి వేయమంటే వారి పేరు నమోదు చేస్తారని, ఈ విషయం వీఏఏలకు కూడా తెలియదన్నారు.


ఈటీసీ ప్రిన్సిపాల్‌కు ఉత్తమ పురస్కారం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జుత్తిక వేణుగోపాల్ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొని పలువురు అధికారులకు ఉత్తమ పురస్కారాలు అందజేశారు. దీనిలో భాగంగా వివిధ శాఖల అధికారులకు ఉత్తమ శిక్షణ ఇచ్చినందుకు రాష్ట్రంలోని మూడు ఈటీసీల ప్రిన్సిపాళ్లు ఎంపిక కాగా వారిలో సామర్లకోట ప్రిన్సిపాల్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి

కొత్తపల్లి: ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి హరికృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన



రచ్చబండ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు భూమి పూజ చేస్తారన్నారు. దీని కోసం కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పిఠాపురంతో పాటు కొత్తపల్లి మండలంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. పిఠాపురంలో రచ్చబండ నిర్వహించడానికి అధికారులు స్థానిక ఆర్ఆర్బీహెచ్ఆర్ కాలేజీలో ఏర్పాట్లు చేస్తున్నారు.



పిఠాపురం మంగయ్యమ్మరావుపేటలో డ్రైన్ దుస్థితి



పిఠాపురం మెయిన్ రోడ్డులో అగ్రహారం వద్ద పేరుకుపోయిన చెత్త

నేత వస్తేనే తీత!

- ఊళ్లో వదిలేసి ఊరవతల ఊడ్పు
- అధికారుల హడావిడికి ముక్కున వేలేసుకుంటున్న పట్టణ ప్రజలు



పిఠాపురం ఉప్పాడ రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది



పిఠాపురం రైల్వే స్టేషన్ వద్ద వాహనాలు మాత్రమే తిరిగే రోడ్డును శుభ్రం చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినిమా యాక్టర్‌గానే చూస్తున్నట్టున్నారు స్థానిక మున్సిపల్ అధికారులు. ఆయన సినిమాల్లో నటించేటప్పుడు సెట్ వేసినట్లు పిఠాపురంలో మున్సిపల్ అధికారులు సెట్ చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆరు నెలలుగా మురుగుకూపంలా మారిన పిఠాపురం పట్టణంలో ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు డిప్యూటీ సీఎం పర్యటించనున్న నేపథ్యంలో ఆయన వెళ్లే రహదారులన్నీ అద్దంలా తుడుస్తున్నారు. ఒక పక్క ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు తాజాగా ఇచ్చిన ఫిర్యాదులను వెనక్కు తీసుకోండని సచివాలయ అధికారుల ద్వారా ఫిర్యాదుదారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.

కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

పిఠాపురం: భవన నిర్మాణ కార్మికుల సహనాన్ని పరీక్షించొద్దని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లెయిముల పరిహారాలను కార్మికులకు తక్షణం చెల్లించాలని కోరుతూ ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజ్ కుమార్, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయడానికి ఇంకెన్ని సంవత్సరాలు సమయం కావాలని ప్రశ్నించారు. తక్షణం ఉచిత ఇళ్ల నిర్మాణాలు చేపట్టి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల ర్యాలీల సందర్భంగా రూ.2 కోట్ల ఆర్థిక సహకారాన్ని కార్మికులకు అందిస్తానని చేసిన వాగ్దానాన్ని అమలుచేయాలని వారు కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ కుంచె చిన్న, దేగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

సామర్లకోట: విద్యార్థులలో పోటీతత్వం పెరగడానికి ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్నట్టు జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల హెచ్ఎం యూ.మీనామాధురి తెలిపారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. పాఠశాలకు చెందిన బెజవాడ నాగ హారిక 582 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానం పొందడం ఆనందంగా ఉన్నదన్నారు. ఈ మేరకు నాగ హారిక, కసిరెడ్డి గాయత్రి, జి శ్రీవల్లిలను ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు సత్కరించి నగదు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు సత్కారం

స్థానిక బీబీఆర్ హైస్కూల్‌లో పదో తరగతి ఉత్తీర్ణులను వారి ఇళ్లలో తల్లిదండ్రుల సమక్షంలో గురువారం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, 31 వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ సత్కరించారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి వారిని సత్కరించినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి మౌలిక సదుపాయాలతో పాటు నిపుణులైన టీచర్లు ఉన్నారని ఆయన తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులలో తెలివి తేటలు వెలికితీయడానికి చెస్ బోర్డులు అందజేసినట్టు తెలిపారు.



విద్యార్థినికి చెస్ బోర్డు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సురేష్‌కుమార్

మండు వేసవిలో మూగజీవాలను ఆదరిద్దాం



చలివేంద్రాలు ప్రారంభిస్తున్న సద్గురువు ఉమర్ ఆలీషా

కాకినాడ రూరల్: మండు వేసవిలో మూగ జీవాలకు ఆహారం, నీరు అందివ్వాలని పిఠాపురం విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టరు ఉమర్ ఆలీషా పిలుపు ఇచ్చారు. సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ వద్ద ప్రధాన రహదారిని ఆనుకుని పీఠం కాకినాడ సభ్యుల ఆధ్వర్యంలో మనుషులతో పాటు పక్షులు, పశువుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ అద్వైత ఆశ్రమం వేదాంత ఆచార్య స్వామి కృపానంద తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఆధ్వర్యంలో..

పెద్దాపురం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దేవదాయ శాఖ కృషి చేస్తుందని కౌడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు వెంకటేశ్వర ఆలయం వద్ద దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవి దృష్ట్యా పాదచారులు, యాత్రికులకు చలివేంద్రాల ఏర్పాటు అవసరమన్నారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ రాజు బాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అగ్రహారంలోని జంతు వధశాల మూసివేత

పిఠాపురం: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం పిఠాపురం అగ్రహారంలో ఉన్న జంతు వధశాలను మూసివేసినట్లు మున్సిపల్ కమిషనర్ నామా కనకారావు తెలిపారు. దాని అక్కడి ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ కార్యదర్శి గోపాలరావు హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం విచారణ అనంతరం కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండా వధశాలను ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నిస్తూ, దానిని వెంటనే మూసివేయాలని పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. దీంతో ఆయన పారిశుధ్య విభాగం అధికారి ప్రభాకర్‌తో కలసి తనిఖీ చేసి అనంతరం సీజ్ చేశారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సామర్లకోటలో పారిశుధ్య కార్మికులను సత్కరించిన ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు



పారిశుధ్య కార్మికులను సత్కరించిన పంచాయతీ సిబ్బంది

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జెడ్పీ సమావేశానికి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్‌కల్యాణ్ హాజరైనపుడు పారిశుధ్య కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లతానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి అధ్యక్షత వహించి పంచాయతీరాజ్ దినోత్సవ ప్రాధాన్యాన్ని, పారిశుధ్య కార్మికుల సేవలను వివరించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ఉత్తమ సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికులను ఎంపిక చేసి సత్కరించారు. అంతకు ముందు అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి సతీష్‌బాబు, జగన్నాథరావు, జి.మేడపాడు సర్పంచ్ పటాని దేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవాలి

ప్రజల ఆరోగ్యం కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని మాధవపట్నం సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మాధవపట్నం పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల సత్కార కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలు!

- చకచకా సర్కారీ బడుల విలీనం
- యథేచ్ఛగా నిబంధనలు బేఖాతరు
- కూటమి ప్రభుత్వ తీరుతో తల్లిదండ్రుల్లో ఆందోళన



ప్రాథమిక పాఠశాలగా మారిన యూపీ పాఠశాల

పెద్దాపురం: కూటమి ప్రభుత్వం మోడల్ స్కూళ్ల పేరుతో పాఠశాల తరగతులను విలీనం చేయడం ప్రారంభించింది. ఇప్పటికే ఉన్న ప్రాథమిక పాఠశాలలను 1, 2 తరగతులను ఉంచి 3, 4, 5 తరగతులను మరో చోటకు మారుస్తూ వాటినే మోడల్ స్కూళ్లుగా నామకరణం చేసేశారు. ఈ మేరకు విద్యా కమిటీలతో బలవంతంగా తీర్మానాలు సైతం చేయించారు.

పెద్దాపురం అర్బన్, రూరల్ పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే విద్యార్థులను మార్చేయాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. ఈ మేరకు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 14 పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్‌గా మారుస్తూ ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను తరలించడంతో ఇక మిగిలేది ఇద్దరు నుంచి 10 మంది లోపు ఉన్న పాఠశాలలే. భవిష్యత్‌లో వీటిని మూసివేసే దిశగా యోచిస్తున్నారు.

పెద్దాపురానికి అన్యాయం

పట్టణంలో మూడు ఉన్నత పాఠశాలలు, నాలుగు అప్పర్ ప్రైమరీ పాఠశాలలు ఉండగా వాటిలో రాజీవ్‌గాంధీ, గోలి చిన్నకొండయ్య, వివేకానంద మూడు అప్పర్ ప్రైమరీ (యూపీ) పాఠశాలలను ఎలిమెంటరీ మోడల్ స్కూల్స్‌గా మార్చారు. రాజీవ్ కాలనీ యూపీ స్కూలును హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం 60 మంది విద్యార్థులు దాటి ఉంటే దానిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి. అధికారులు ఎలిమెంటరీ పాఠశాలలుగా మార్చేసిన వాటిలో మూడు పాఠశాలల్లో వంద నుంచి 130 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. అయినప్పటికీ మార్పు తప్పలేదు.

దూరం పాఠశాలలకు వెళ్లేలా

విద్యార్థులు ఎవరూ రోడ్డు దాటి వెళ్లకుండా పాఠశాలల మార్చాలని చెబితే పెద్దాపురంలో పాఠశాలలను ఆర్అండ్‌బీ రోడ్డు దాటి వెళ్లాల్సి వచ్చేలా మార్చారు. పట్టణ జనాభాను దృష్టిలో ఉంచుకుని పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల సంఖ్యను పెంచాల్సి ఉంటే పాఠశాలలను తగ్గించే పనిలో నిమగ్నం కావడం కూటమి ప్రభుత్వానికి విద్య పట్ల ఉన్న శ్రద్ధ అర్థమౌతోంది.


నిర్వీర్యం చేయడమే లక్ష్యం



ప్రభుత్వం యూపీ పాఠశాలలను ఎత్తివేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. గత ప్రభుత్వం 117 జీవో తెస్తే దాన్ని రద్దు చేసి పాఠశాలలను అభివృద్ధి చెస్తామని చెప్పి, ఇప్పుడు మూసివేత దిశగా అడుగులు వేస్తోంది. కొన్నింటిని విలీనం చేసి, మరికొన్నింటిని మూసివేస్తున్నట్టు తెలుస్తోంది. దీని వల్ల విద్యార్థులు ఉన్నత పాఠశాల విద్యకు దూరమవుతారు. దీన్ని వ్యతిరేకిస్తాం.

-డి.క్రాంతికుమార్, సీపీఎం మండల కార్యదర్శి, పెద్దాపురం.

దళితులకు విద్య అందకుండా



కూటమి ప్రభుత్వం దళితులకు ఉన్నత విద్యను దూరం చేస్తోంది. యూపీ పాఠశాలల విలీనం పేరుతో పట్టణంలో దళితులు అధిక సంఖ్యలో చదువుకునే వాటినే వీలీనం చేయడం శోచనీయం. విద్యార్థులను ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు.

- ఆరెళ్ళి వీర్రాఘవులు, ఒకటో వార్డు కౌన్సిలర్, పెద్దాపురం

కార్యదర్శికి తెలియకుండా మెప్మా రుణం

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్, మహిళా సంఘం కార్యదర్శి

సామర్లకోట: మెప్మా సిబ్బంది పక్షపాత వైఖరి, ఆర్పీల చేతి వాటంతో మహిళా సంఘాలలోని గ్రూప్ సభ్యులకు అన్యాయం జరుగుతోందని కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు గురువారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలో రోజా మహిళా సంఘం పేరుతో అనుసూరి అన్నపూర్ణ కార్యదర్శిగా ఉన్నారు. ఆమెకు తెలియకుండా మిగిలిన తొమ్మిది మంది వడ్డీలేని రుణం తీసుకొని కార్యదర్శికి అన్యాయం చేశారని ఆరోపించారు. కార్యదర్శి సంతకం లేకుండా మెప్మా అధికారులు ఏ విధంగా సిఫార్సు చేస్తారని, బ్యాంకు అధికారులు రుణం ఏ విధంగా ఇస్తారని అనుసూరి అన్నపూర్ణ, నేతల హరిబాబు ప్రశ్నించారు. తనను సంఘం నుంచి తొలగిస్తే తనకు సమాచారం ఇవ్వాలని అటువంటి సమాచారం లేదని, కొత్త కార్యదర్శి ఎన్నికవలేదని కార్యదర్శి ఆరోపించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ మెప్మా సీఓ వెంకటలక్ష్మిని వివరణ కొరారు. కార్యదర్శికి చెప్పినా హాజరు కాకపోవడంతో తొమ్మిది మంది సభ్యులు ఆమెకు రుణం ఇవ్వడానికి అంగీకరించడం లేదన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని హరిబాబు, సంఘ కార్యదర్శి అన్నపూర్ణలు కమిషనర్‌ను కొరారు.

చెత్తతో చెరువును పూడ్చేస్తున్నారు

- దుర్గంధభరితంగా నాగులాపల్లి
- పట్టించుకోని అధికారులు



చెత్తతో నిండిపోయిన చెరువు

కొత్తపల్లి: మండలం నాగులాపల్లి శ్మశాన వాటిక పక్కన ఉన్న చెరువును పంచాయతీ అధికారులు చెత్తతో పూడుస్తున్నారు. నాగులాపల్లి సెంటర్‌లో దుర్గాదేవి ఆలయ సమీపంలో ఉన్న శ్మశాన వాటికకు వచ్చేవారు ఆ చెవురులోనే స్నానాలు చేసేవారు. ఆ చెరువు రెవెన్యూ స్థలం కావడంతో గత ప్రభుత్వంలో చెరువును పూడ్చి ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు చేపట్టారు. శ్మశాన వాటిక పక్కనే ఉండడంతో లబ్ధిదారులు అక్కడకు వెళ్లేందుకు నిరాకరించారు. కూటమి ప్రభుత్వంలో శ్మశాన వాటికకు సంబంధించిన చెరువును కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను పంచాయతీ అధికారులు అక్కడ వేయిస్తున్నారు.

దీంతో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిని ఆనుకుని ఉండడంతో రోడ్లపై గుట్టలుగా చెత్తవేసి ప్రయాణికులు వెళ్లేందుకు వీలు లేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉగ్రదాడికి నిరసనగా మానవహారం



నాగులపల్లిలో మానవహారం నిర్వహించిన ప్రజలు

కొత్తపల్లి: జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ మండలంలోని నాగులపల్లిలో మానవహారం నిర్వహించారు. ఇటువంటి దాడి పిరికి పంద చర్యగా పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

క్లాప్స్ నిరసన..

పెద్దాపురం: జమ్మూ కాశ్మీర్‌లో అమాయక పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యని పట్టణ క్లాప్స్ తీవ్రంగా ఖండించింది. క్లాప్ వ్యవస్థాపకులు లంక పురుషోత్తమ్ దాస్ గురువారం స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఇటువంటి దాడులు జరుగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నామని దాస్ తెలిపారు.